

# రిటైరైన మేక

శివరామయ్య గేటు తీసుకుని ఇంట్లోకి వెళ్ళేటప్పటికి, భార్యమాటలు పెద్దగా వినిపిస్తున్నాయి.

అత్తా కోడళ్ళ మధ్య ఏదైనా గొడవ జరిగివుంటుందా? అని అనుమానం వచ్చింది.

"ఏరారామూ, నాయనమ్మా, తాతమ్మా పోట్లాడుకున్నారా ఏం? ఎవరి మీద కేకలేస్తోంది? అని పెద్దమనవడిని అడిగాడు.

"పోట్టాడుకోలేదు తాతయ్యా! మేకలు గొడదూకి వంకాయలు, బంతిపూలు తిని పోయాయి" అన్నాడు మనవడు.

"చచ్చాంరా భగవంతుడా!" అనుకుంటూ హాల్లోకివెళ్ళి పడక కుర్చీలో కూలబడి పోయాడు.

"మాయదారి సంత మాయదారిసంతని మేకలు పెంచుకునేవాళ్ళు అడవికి తోలుకోవాలిగాని ఇలా వూరిమీదకు అచ్చుబోసిన అంబోతుల్ని వదిలినట్లువదుల్తారా? రెక్కలు ముక్కలయ్యేట్లు పనిజేసి మొక్కల్ని పెంచుకోవడమూ, కాయలు కాసేటయానికి

వీటిముఖాన పెట్టడమూ....” శ్రీ మహాలక్ష్మి వాక్ప్రవాహం అలా ఎంతసేపు సాగేదో గాని భర్తనిచూసి ఒక్క క్షణం ఆగిపోయింది.

“ఇదుగో మిమ్మల్నే”

“నువ్వు చెప్పబోయేది తెల్సులేవే, మేకలు వంకాయలు తిని పొయ్యాయి. అంతేనా!” అన్నాడు.

“ఆc... అదే, ఆ మేకలు భీమయ్యవేనట, వెళ్ళి ఒకసారి బుద్ధి చెప్పిరండి’ మేకలు పెంచుకునే వాడు అడవిలో మేపుకోవాలిగాని ఇలా కొంపల మీదకు తోల్తాడా? కిలో వంకాయలు తిని పొయ్యాయి. ముద్దుగా పూసిన ముద్ద బంతిపూలు తిని వాటి కడుపులు పగల గొట్టుకున్నాయి. వాటి ఖరీదు ఎవడిస్తాడు?”

“ఇంతకూ ఆ భీమయ్య ఎవరే”

“నా ఖర్మ, రిటైరైపోయాక మీకు మతిపోయినట్లుంది. మీ ఆఫీసులో ఆ జవాను లేడూ భీమయ్యని మనింటికి గూడా చాలాసార్లు వచ్చాడు”

“ఒహో c ఆ భీమయ్యా!”

“ఆc – అతగాడే, వెళ్ళి నిలదీసి అడగండి అసలు మన పెరట్లో మొక్కలు పెంచడం మానుకోమంటాడో ఏమో! “కిలో వంకాయలు, బంతిపూలూ కొనివ్వమనండి చంటిదానికి పూలజడ వేద్దామనుకున్నాను”

“శివరామయ్య బెల్లంకొట్టిన రాయిలా కూర్చున్నాడు.

“అయ్యో! చెప్తుంటే మీక్కాదూ! అసలు రిటైరై పోయాక సోమరితనం పెరిగిపోయింది కొడుకులు తెచ్చి పెడుతుంటే తిని బద్ధకం–”

“అబ్బ అపవే బాబూ! కాసిని కాఫీ నీళ్ళు తగలెయ్ ముందు” విసుగ్గా అన్నాడు.

“నా మతి మండిపోనూ, మీకు కాఫీ ఇవ్వనేలేదు గదూ!” వంటగదిలోకి వెళ్ళి కాఫీ తెచ్చి అందించింది.

శివరామయ్య కాఫీ త్రాగి పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు.

పది నిముషాల తర్వాత శ్రీ మహాలక్ష్మి సుడిగాలిలా వచ్చి “మీరింకా వెళ్ళలేదన్న మాట, మీరెందుకు వెళతారు మీకేం పట్టింది” అంది.

“అబ్బ ఏమిటే నీ గోల”

“ఆ భీమయ్య దగ్గరికి వెళ్ళి రమ్మన్నానా? పోనీలే అని వూరుకుంటే వాడికేం భయం వుంటుంది?”

“వుండదు”

“మరి కదలరేం?”

"భీమయ్య ఇల్లెక్కడో? ఎక్కడికి వెళ్ళమంటావ్?"

"అయ్యో ! భీమయ్య ఇల్లే తెలియదా మీకు? మన వీధి చివర్లోనే పాకవేసి వుంటుంది చూడండి. ఇంటిముందే పెద్ద వేపచెట్టుగూడా వుంటుంది. చూడగానే గుర్తుపట్టొచ్చు."

"వెళుతున్నా లేవే" అంటూ లేచాడు. ఇక తప్పదన్నట్లు.

"గట్టిగా అడగండి. ఈ సారి మేకలు వస్తేమాత్రం చావగొడ్తానని చెప్పండి"

శివరామయ్య గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ పాక భీమయ్యదని చూడగానే గుర్తుపట్టాడు. దానిచుట్టూ వంకర టింకర కర్రలతో దడి కట్టివుంది. లోపల మసక చీకట్లో మేకలు ఆకాశంలో నల్ల మబ్బుల్లా కదలాడుతున్నాయి. ఒక మూలగా మేక ఎరువు రాసిపోసివుంది. నేలంతా తడితడిగా అసహ్యంగా వుంది, భరించరాని ఆ వాసన ముక్కుకు ఘాటుగా తగుల్తుంటే మరో ప్రపంచంలోకి అడుగుపెట్టి నట్లుంది.

"నేనే తమరింటికి వద్దామనుకుంటున్నాను. తమరే వచ్చేశారు "అంటూ భీమయ్య కుక్కి మంచం వాల్చాడు.

శివరామయ్య కూర్చోగానే అది కిర్రుమని మూలిగింది.

"ఇలా జరుగుతుందనుకోలేదు బాబు గారూ!" అన్నాడు భీమయ్య.

"పోనీ లేవయ్యా! జరిగిందేదో జరిగింది ఇకముందు అలా జరక్కుండా చూసుకుంటే సరి" అన్నాడు శివరామయ్య.

"అట్టా అంటే ఎట్టా కుదురుద్దండీ మా ఆడదాని సంగతి తమకి తెలియదు. రాక్షసిముండబాబూ! అది నోరిప్పితే చిన్నంతరం పెద్దంతరం లేకుండా మాట్లాడుద్ది బాబూ!"

శివరామయ్య అర్థం కానట్లు అయోమయంగా చూశాడు.

'నోర్లేని జీవాలు బాబూ! వాటికేం తెలుసుద్ధి? ఏదో తిన్నాయనుకోండి అంత మాత్రనా సంపేత్తారా బాబూ!" అన్నాడు భీమయ్య.

శివరామయ్యకి మతిపోయింది.

"చంపేశారా ఎవరు? అన్నాడు ఆశ్చర్యంతో.

"ఇంకెవరు బాబూ! తమరింట్లో వాళ్ళే, రాయితో కొట్టారంట మేకపిల్ల దిమ్మదిరిగి పడిపోయింది.

"మా పెద్దోడు సేతులమీద ఎత్తుకొచ్చాడు. సూడండిబాబూ ఎట్టా రొప్పుతుందో"

అప్పటివరకూ ఆ మేకపిల్ల పడుకుని వుందనుకున్నాడు గాని చావు బ్రతుకుల మధ్యవుందని ఏం తెలుసు? అది కళ్ళు తేలేసి ఇప్పుడో ఇంకాసేపో అన్నట్లుంది.

అతని గుండె గుభేలుమంది. జరిగిందేమిటో అతనికి అర్థమైంది, ఇదంతా శ్రీ మహాలక్ష్మిపనే కాని ఆ మాటంటే చస్తే వప్పుకోదు, తిట్టి శాపనార్థాలు పెడుతుంది. ఇప్పుడెట్లా?

"అది సస్తే కటికోడు గూడా కొనడు. తెల్లారిలేసి ఎవుడిమొగం చూశానో అంతానష్టమే" నిష్టూరంగా అన్నాడు భీమయ్య.

శివరామయ్యకి ఏం మాట్లాడాలో తోచక దిక్కులు చూస్తూ కూర్చున్నాడు, ఎందుకొచ్చాన్రా భగవంతుడా అనుకున్నాడు.

"తమరింటికెళ్ళి డబ్బు వసూలు చేసుకు రమ్మని మా ఆడది పోరుపెడుతూ వుంది బాబూ!" అన్నాడు భీమయ్య.

'ఇదుగో ఇట్టారా!" లోపల్నుంచి అతని భార్య కాబోలు కేకేసింది.

భీమయ్య లోపలికెళ్ళాడు.

అతనికి ముళ్ళమీద కూర్చునట్లుంది.

కాసేపటికి భీమయ్య బైటికివచ్చి "ఓ పదియిస్తే గాని వల్లకాదంటోంది. ఇవ్వకపోతే తవరింటికొచ్చి అల్లరిసేస్తానని గొడవపెడుతోంది బాబూ!" అన్నాడు.

శివరామయ్య లేచి నిల్చున్నాడు. మరో మాట లేకుండా పర్సుతీసి పది భీమయ్య చేతికిచ్చి తిరుగుముఖం పట్టాడు.

ఇంట్లో అడుగుపెట్టగానే శ్రీ మహాలక్ష్మి ఎదురొచ్చి "ఏమన్నాడు భీమయ్య? బాగా చీవాట్లు పెట్టారా లేదా? ఈసారి వాళ్ళ మేకలు వస్తే కాళ్ళిరగొడ్తానని చెప్పారా లేదా?" అంటూ ప్రశ్నలు వర్షం కురిపించింది.

తను భీమయ్య ఇంటికెళ్ళి చేసుకొచ్చిన నిర్వాకం చెప్తే తనని అసమర్థుడి క్రింద జమకట్టి చచ్చేవరకూ సాధించి చంపుతుంది.

"మూగి మొద్దులా మాట్లాడరేమండీ? ఆ బుట్టలో ఏమిటి?"

"కిలో వంకాయలు, బంతిపూలు"

"ఎక్కడివి?"

"భీమయ్య కొనిచ్చాడు" అన్నాడు శివరామయ్య ఏడవలేక నవ్వుతూ.

రిటైరై పోయింతర్వాతయినా భర్త ప్రయోజకుడైనందుకు శ్రీమహాలక్ష్మి ఎంతో సంతోషించింది.

*–జయసుధ వారపత్రిక, 6-4-1979*